క్లుప్తంగా

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం



రాపూరు ఆర్టీసీ డిపోలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న బషీర్‌అహ్మద్

రాపూరు: ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని రాపూరు ఆర్టీసీ డిపో ఎస్‌టీఐ బషీర్‌అహ్మద్ తెలిపారు. రాపూరు ఆర్టీసీ డిపో నుంచి వెంకటగిరి, గూడూరు మార్గాల్లో నడుస్తున్న బస్సుల్లో ప్రయాణించే వారిలో లక్కీ డిప్ ద్వారా విజేతలను ఎంపిక చేసి ఆదివారం బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో ప్రయాణించే వారిని ప్రోత్సహించేందుకు ప్రతి 15 రోజులకు ఒకసారి లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేసి బహుమతులు అందజేస్తున్నట్టు తెలిపారు. ప్రయాణికులు తమ టికెట్‌పై ఫోన్ నంబర్, అడ్రస్ రాసి బస్సులో ఏర్పాటుచేసిన బాక్స్‌లో వేయాలన్నారు. నలుగురిని ఎంపిక చేసి బహుమతులు అందజేస్తామన్నారు.

ఓజిలిలో ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు

ఓజిలి: ఎస్సీ వర్గకరణ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం ఓజిలి బస్టాండ్‌లో సంబరాలు జరుపుకున్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణమాదిగ, అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మాదిగ ఉద్యోగుల సమైఖ్య జిల్లా అధ్యక్షుడు తోళ్ల నారాయణ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ మాదిగలకు ఎంతో ఉపయోగమన్నారు. మాలలకు సమానంగా మాదిగలకు రిజర్వేషన్లు వర్తిసాయని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నన్నూరు శ్రీనివాసులు, నన్నూరు రాగయ్య, కంటేపట్టి చెంచుకృష్ణయ్య, పెద్దమస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

తాళ్వాయిపాడులో ఎస్‌ఐ పల్లెనిద్ర



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ నాగరాజు

పెళ్లకూరు: సమాజంలో ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో మెలగాలని ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. ఆయన ఆదివారం తాళ్వాయిపాడు గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అరుంధతి కాలనీ, మహాలక్ష్మమ్మ ఆలయం వద్ద గ్రామస్తులకు శాంతిభద్రతలపై అవగాహన కల్పించారు. ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. యువకులు జట్టుగా ఏర్పడి చోరీలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

సీహెచ్‌సీలో వసతులు కరువు

నాయుడుపేట టౌన్: నాయుడుపేటలోని సీహెచ్‌సీలో రోగులకు వసతులు కరువయ్యాయని బీజేపీ నాయకులు ఆరోపించారు. వారు ఆదివారం వైద్యశాలలో తనిఖీ చేశారు. సూపరింటెండెంట్ సైతం విధులకు హాజరుకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఇక్కడి సమస్యలపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. ఆశా చెంచు కృష్ణయ్య, బి.విజయకుమార్, డాక్టర్ రంగినేని కృష్ణయ్య, ఏ. రామయ్య, డి.మధుసూదన్‌రెడ్డి, సి.సురేంద్ర, కె.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వెంకటగిరికి చేరిన రవితేజ పార్థివదేహం



వెంకటగిరి రూరల్: అమెరికాలో గత ఆదివారం మృతి చెందిన వెంకటగిరి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సాయి వరప్రసాద్ కుమారుడు రవితేజ(35) పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులు చెన్నై ఎయిర్‌పోర్టు నుంచి వాహనంలో వెంకటగిరి తీసుకొచ్చారు. వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి అనూష, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు గల్లా సుదర్శన్, వెంకటగిరి, గూడూరు, నెల్లూరు ప్రాంతాల్లోని పలువురు న్యాయవాదులు వెంకటగిరికి చేరుకుని రవితేజ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధ్యి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పేదలకు సరుకుల పంపిణీ

చిల్లకూరు/గూడూరు రూరల్ : గూడూరులోని డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ సీఆర్‌రెడ్డి ఆసరా పథకం కింద పేదలకు నెలకు సరిపడా ఫలసరుకులు అందజేశారు. రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ డాక్టర్ సీఆర్‌రెడ్డి జ్ఞాపకార్థం డాక్టర్ జనార్దన్‌రెడ్డి, రోహిణి ప్రతినెలా పేదలకు సరుకులు అందజేస్తున్నట్టు తెలిపారు. అలాగే జేవీవీ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో దివ్యాంగులకు కూరగాయలు అందజేశారు. సంఘం అధ్యక్షుడు శ్రీకిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, ప్రజేంద్రరెడ్డి, నిరంజన్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కిషోర్‌రెడ్డిపాల్గొన్నారు.

శిథిలావస్థలో భవనాలు



అసంపూర్తిగా ఆగిన కొత్త భవనం

చిట్టమూరు: మండలం తంబుగారిపాళెం ప్రాథమిక పాఠశాల భవనం పనులు పూర్తికాకుండానే శిథిలావస్థకు చేరింది. దీని నిర్మాణ పనులను కాంట్రాక్టర్ 2015లో చేపట్టారు.తర్వాత దాని గురించి పట్టించుకోలేదు. ప్రస్తుతం ఉన్న పాఠశాల తభవనం కూడా శిథిలావస్థకు చేరింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న పాత పాఠశాల భవనం

ఊడిన పెచ్చులు.. తప్పిన ప్రమాదం



రాపూరు గంథాలయంలో కింద పడిన పైకప్పు పెచ్చులు

రాపూరు: రాపూరులోని గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరింది. గది పైకప్పు పెచ్చులూడి కింద పడుతున్నాయి. ఆదివారం సాయంత్రం పెచ్చులు ఊడి కింద పడ్డాయి. ఆ సమయంలో తక్కువ సంఖ్యంలో పాఠకులు ఉండడంతో ప్రమాదం తప్పింది. శిథిలావస్థకు చేరిన భవనాన్ని తొలగించి కొత్త భవనం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న రాపూరు గ్రంథాలయం

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

చిట్టమూరు: చిట్టమూరు మండలంలో కూటమి నేతలు అధికారం అండతో రెచ్చిపోతున్నారు. గునపాడు చెరువులో జేసీబీలతో మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా ప్రైవేట్ లేఅవుట్లు, ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. చెరువు తూములకంటే ఎక్కువ లోతు వరకు మట్టిని ఎత్తి వేయడంతో నీరు పొలాలకు చేరే పరిస్థితి లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి తవ్వకాలను అడ్డుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



గునపాడు చెరువులో ట్రాక్టర్లకు మట్టి పోస్తున్న జేసీబీ



ట్రాక్టర్లతో చెరువు మట్టి తరలింపు

ఏసుక్రీస్తు పునరుత్థానమే ఈస్టర్

దొరవారిసత్రం / నాయుడుపేటటౌన్ / వాకాడు / పెళ్లకూరు / చిల్లకూరు / ఓజిలి: ఏసు మరణించిన మూడో రోజు తిరిగి లేవడమే ఈస్టర్ అని దైవ సేవకులు తెలిపారు. దొరవారిసత్రం మండలం వేణుంబాకం, అక్కరపాక, దొరవారిసత్రం, నేతాజీ నగర్, వీఎంఆర్ నగర్, ఏకొల్లు, కుప్పారెడ్డిపాళెం, ముచ్చలగుంట, నెల్లూరుపల్లి, రామారెడ్డికండ్రిగ, కృష్ణాపురం, ఆనేపూడి, నెలబల్లి, మైలాంగం తదితర ప్రాంతాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ కె.రవికుమార్, చంద్రయ్య దైవ సందేశాన్ని వినిపించారు.

- నాయుడుపేట పట్టణంలోని బేరిపేట ఎస్‌ఏఎల్‌సీ చర్చి, రోమన్ క్యాథలిక్ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సమాధి తోటలను పూలతో అందంగా అలంకరణ చేపట్టి తెల్లవారిజాము నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎస్‌ఏఎల్‌సీ చర్చి సమీపంలోని సమాధి తోటల వద్ద బిషప్ మైఖేల్ బెన్‌హర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.
- వాకాడులోని సెయింట్ జేమ్స్ లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంఘ కాపరి ప్రశాంత్ బాబు దేవుడి సందేశాన్ని వినిపించారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన పలువురు క్రైస్తవులు రెండు రోజులు ముందుగానే స్వగ్రామం చేరుకుని తమ పూర్వీకుల సమాధులను పూలతో అలంకరించి స్మరించుకున్నారు. కార్యక్రమాల్లో నాయుడుపేట పరిశుద్ధ కొతురు కొలు సంఘ చైర్మన్ కేఎం కారల్ మధు, వైస్ చైర్మన్ కాళహస్తి బాబురావు, కళాచంద్, మాజీ పీసీసీ చైర్మన్ కేజే జ్ఞానందం తదితరులు పాల్గొన్నారు.
- పెళ్లకూరు మండలంలోని పెళ్లకూరు, చిల్లకూరు, అనకవోలు, చావలి, శిరసనంబేడు, చెంబేడు తదితర ప్రాంతాల్లోని క్రైస్తవులు సమాధుల తోటకు చేరుకొని పూజలు, ప్రార్థనలు చేశారు. చర్చిల్లో గీతాలు ఆలపించారు. పేదలకు దుస్తులు, అన్నదానం చేశారు.
- గూడూరు పట్టణంలో క్రైస్తవులు ఈస్టర్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. క్రైస్తవుల సమాధుల తోటలో సమాధులను పూలతో అలంకరించి కొవ్వొత్తులు వెలిగించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పరిశుద్ధ పౌలు పేతురు లూథరన్ సంఘ కాపరి రెవరెండ్ ప్రవీణ్‌రాజ్ దేవుడి సందేశాన్ని వినిపించారు.
- చిల్లకూరు మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు తమ పూర్వీకుల సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కమ్మవారిపాళెం, ఓడూరు, తిమ్మనగారిపాళెం, కలవకొండ, ఏరూరు, మోమిడి, పల్లమాల, అన్నంబాక గ్రామాల్లోని లూథరన్ చర్చిల సంఘ కాపరులు దైవ సందేశం అందించారు.
- ఓజిలిలోని లూథరన్ చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవులు ఈస్టర్‌ను జరుపుకున్నారు. ఇందులో భాగంగా సమాధుల తోట వద్ద సమాధులను పూలతో అలంకరించి కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంఘ కాపరి రెవరెండ్ రాజరత్నం దైవ సందేశం వినిపించారు.



దొరవారిసత్రం: నెల్లూరుపల్లి గ్రామంలోని సమాధుల తోటలో ప్రత్యేక ప్రార్థనలు



నాయుడుపేటలోని సమాధి తోటలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



వాకాడులోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



వాకాడులో రక్షణ సువార్త గీతాల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న క్రైస్తవులు



పెళ్లకూరు: అనకవోలు చర్చిలో గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు



గూడూరులోని సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



ఓజిలి: సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

25 నుంచి తిరునాళ్లు

తడ: మండలంలోని వాటంబేడులో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో 25 నుంచి మే 5వ తేదీ వరకు తిరునాళ్లు నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. తిరునాళ్లలో భాగంగా 23వ తేదీన ధ్వజ స్తంభ ప్రతిష్ట, జీర్ణోద్ధరణ మహా కుంబాభిషేకం చేపట్టనున్నట్టు గ్రామస్తులు తెలిపారు. అనంతరం తిరునాళ్లు నిర్వహిస్తామన్నారు.

28 నుంచి ఆదిశంకర జయంతి ఉత్సవాలు

వెంకటగిరి రూరల్: వెంకటగిరి కర్ణకమ్మ వీధిలో ఉన్న శంకరమఠంలో 28 నుంచి మే 2 వరకు ఆది శంకర జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వేద పండితులు జీవీఎస్ శాస్త్రి తెలిపారు. ఆయన ఆదివారం ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థినికి నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్: సీఎం చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా కూటమి నాయకులు ఆదివారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా బీఎస్సీ చదువుతున్న పేద విద్యార్థినికి రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. మహిళలకు చీరలు, ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు రొట్టెలు పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి, సన్నారెడ్డి చంద్రారెడ్డి, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కల్కి భగవాన్ అక్రమ నిర్మాణాలు కూల్చేయాలి



మాట్లాడుతున్న నార్ని వెంకటసుబ్బయ్య

సూళ్లూరుపేట: కల్కి భగవాన్ పేరుతో విజయ్‌కుమార్ అనే వ్యక్తి ప్రజలను, ప్రభుత్వాలను మభ్యపెట్టి 20 ఏళ్ల క్రితం వరదయ్యపాళెంలోని దళితుల అసైన్డ్ భూములను ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలను కూల్చివేయాలని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్ని వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం సూళ్లూరుపేట సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విజయ్‌కుమార్ అసైన్డ్ భూములను ఆక్రమించుకుని రూ.500 కోట్లతో ఆశ్రమాన్ని నిర్మించారని తెలిపారు. భూముల ఆక్రమణ విషయంలో కల్కి ట్రస్టు వేసిన కేసులను హైకోర్టు 2024 జనవరి 10న కొట్టివేసిందని తెలిపారు. అధికారులు దళితులకు భూములు ఇవ్వకుండా నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. బుచ్చినాయుడుకండ్రిగ మండలం కల్లివెట్టు గ్రామం దగ్గర సర్వే నంబర్ 295లోని 21 ఎకరాల అటవీ భూములను ఆక్రమించుకుని పెద్ద పెద్ద భవనాలు నిర్మించినా ఎవరూ పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో హేతువాద నాయకులు రాజు, వెంటకరమణ, కల్కి బాధితులు ముని చంద్రయ్య, రాము, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్త వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి



వెంకటగిరిలో వాహనాల పత్రాలను పరిసీలిస్తున్న సీఐ ఏవీ రమణ



సూళ్లూరుపేట రూరల్‌లో పత్రాలు లేని వాహనాలను పరిశీలిస్తున్న పోలీసులు

వెంకటగిరి రూరల్/సూళ్లూరుపేట రూరల్: కొత్త వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని వెంకటగిరి సీఐ ఏవీ రమణ, నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని జగనన్నకాలనీ, టిడ్కో అపార్ట్‌మెంట్స్ తదితర ప్రాంతాలు, సూళ్లూరుపేట రూరల్ మండలం కోటపోలూరు పడమర దళితవాడలో ఆదివారం వేకువజామున వెంకటగిరి సీఐ ఏవీ రమణ, నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సర్చ్ నిర్వహించారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ఇళ్లలో అనుమానాస్పద వ్యక్తుల ఆధార్ కార్డులను తనిఖీ చేశారు. వెంకటగిరిలో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 11 మోటారు సైకిళ్లు, 5 ఆటోలను సీజ్ చేశారు. వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి ఎస్‌ఐలు లక్ష్మీభవాని, గోపి, శివశంకర్, సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ బ్రహ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజారోహణం

సైదాపురం: మండలంలోని కృష్ణారెడ్డిపల్లిలోని వెలసిన శ్రీమహావిష్ణువు, శ్రీమహాలక్ష్మి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ధ్వజారోహనాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తిరుచ్చి ఉత్సవం చేపట్టారు.



తిరుచ్చిపై ఊరేగుతున్న స్వామి వారు

ఆర్టీసీ బస్టాండులో విరిగి పడిన పెచ్చులు



కింద పడిన పెచ్చులు



కమ్మీలు కనిపిస్తున్న పైకప్పు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట ఆర్టీసీ బస్టాండు భవనం శిథిలావస్థకు చేరింది. ఆదివారం స్లాబు సిమెంట్ పెచ్చులు ఊడి కింద పడ్డాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇటీవల పెచ్చులు ఊడిపడడంతో ముగ్గురు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ విషయాన్ని ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపొతున్నారు.

క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ

నాయుడుపేట టౌన్: క్రీడాకారులు తైక్వాండోలో అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు మాస్టర్ తైక్వాండో క్లబ్ వ్యవస్థాపకుడు, కోచ్ పవన్ కుమార్ తెలిపారు. పట్టణంలోని బేరిపేటలో ఏర్పాటు చేసిన మాస్టర్ తైక్వాండో క్లబ్‌ను ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ ప్రారంభించారు. కోచ్ మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ పొందిన వారు పోటీల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఇటీవల కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. షేక్ అష్రఫ్, అసిస్టెంట్ కోచ్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు కిలివేటి పరామర్శ

నాయుడుపేట టౌన్: కిందపడి గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ వేడిచర్ల ప్రద్యుమ్నకుమార్‌రెడ్డిని ఆదివారం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. కుమార్‌రెడ్డి నాయుడుపేట పట్టణంలోని తన కార్యాలయం నుంచి ఇంటికి వెళుతుండగా ప్రమాదవశాత్తు కిందపడి గాయపడ్డారు. చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కలికి మాధవరెడ్డి, నాయకులు దొంతాల రాజశేఖర్ రెడ్డి, షేక్ షబ్బీర్, పేట చంద్రారెడ్డి, రాము తదితరులు పరామర్శించారు.



కుమార్‌రెడ్డితో మాట్లాడుతున్న సంజీవయ్య

అగ్నిమాపక పరికరాల ప్రదర్శన

రాపూరు/నాయుడుపేట టౌన్/కోట/వెంకటగిరి (సైదాపురం): అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుంటే నష్టాన్ని కొంతమేర తగ్గించుకోవచ్చని రాపూరు, నాయుడుపేట అగ్నిమాపక శాఖ అధికారులు కుప్పయ్య, డీవీ రమణయ్య, కోట ఎస్‌ఎఫ్‌వో హరీష్, వెంకటగిరి అగ్నిమాపక శాఖ అధికారి నారాయణ తెలిపారు. రాపూరు, నాయుడుపేట, కోట మండలాలు, వెంకటగిరి పట్టణంలో ఆదివారం అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా ప్రమాదాలు జరిగినప్పుడు వినియోగించే పరికరాలపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు 101కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, వెంటనే తమ సిబ్బంది వచ్చి తగిన చర్యలు తీసుకుంటారని వివరించారు. కార్యక్రమంలో రాపూరు ఎస్‌బీఐ మేనేజర్ సత్యనారాయణ, నాయుడుపేట అగ్నిమాపక కేంద్రం లీడింగ్ ఫైర్ మెన్లు చంద్రబాబు, రామకృష్ణ, సందీప్, మురళి, ఫైర్ మెన్లు ఎం నాగరాజు, కే రవీంద్రరెడ్డి, కే పోలయ్య, కోటకు చెందిన నాగరాజు, దేవా, దుర్గాప్రసాద్, సిద్ధిక్ పాల్గొన్నారు.



వెంకటగిరిలో విన్యాసాలు చేస్తున్న అగ్నిమాపకశాఖ అధికారులు



రాపూరులో అగ్నిమాపక పరికరాల గురించి వివరిస్తున్న సిబ్బంది



కోట : అగ్నిప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



నాయుడుపేటలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రభుత్వ పాఠశాలలో చేరాలని వినూత్న ప్రచారం

చిల్లకూరు: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండలంలోని వల్లిపేడు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జగదీష్ వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, ఉచితంగా అందజేస్తున్న పుస్తకాలు, బ్యాగులు, మధ్యాహ్న భోజనం తదితర వివరాలతో ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తున్నారు. ఆయన మాట్లాడుతూ సెలవుల అనంతరం పిల్లలను ప్రయివేటు పాఠశాలల్లో చేర్పించి డబ్బు ఖర్చు చేసుకోకుండా గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఇంగ్లీషు మీడియంలో చేర్పించాలని కోరారు.



హెచ్‌ఎం ముద్రించిన కరపత్రం

యానాదులకు ఆహారం అందజేత

రాపూరు: రాపూరులోని సాయి గిరిజనకాలనీలో నివసిస్తున్న చల్లా యానాదులకు ఆదివారం డాక్టర్ కందుకూరు మస్తాన్‌బాబు, డాక్టర్ చంద్రశేఖర్ ఆహార పొట్లాలు, పండ్లు అందజేశారు. వారు మాట్లాడుతూ తమ తండ్రి డాక్టర్ కందుకూరు కృష్ణయ్య 16వ వర్ధంతి సందర్భంగా కాలనీలోని 100 చల్లా యానాదుల కుటుంబాలకు భోజనం, పండ్లు, రొట్టెలు అందజేసినట్టు తెలిపారు.